క్లుప్తంగా

కవి కరిముల్లాకు గుర్రం జాషువా స్మారక పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన ప్రసిద్ధ కవి కరిముల్లాకు జానపద కాళీకళ ఆధ్వర్యంలో అద్దంకిలో జరిగిన కార్యక్రమంలో గుర్రం జాషువా స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. వినుకొండ గడ్డ నుంచి పేదలు, అభాగ్యుల పక్షం వహించి తెలుగు సాహిత్యంలో తనదైన శైలిలో రచనలు చేశారని వక్తలు కొనియాడారు. ఆయన కవిత్వంపై ఇప్పటికే అనేక యూనివర్సిటీల్లో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. అవార్డు పొందిన కవి కరిముల్లాను న్యాయవాదులు పీజే లూకా, ఎస్ కే సిద్ధయ్య, చిత్రకారుడు వజ్రగిరి జెస్టిన్, గాయకుడు పీఎస్ రాజు అభినందించారు.

పది విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): బీడబ్లేజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బీటలేరుపాలెం మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సామగ్రిని ఆదివారం అందజేశారు. పోలీస్ కానిస్టేబుల్ పోగుల సుబ్బులక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పోగుల కోటేశ్వరరావు సహకారంతో విద్యార్థులకు ఈ వితరణ చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పాపసాని సురేష్, చిన్నకొండ మల్లికార్జునరెడ్డి, కోర్సి విజయ్, ఫూలేటి రామాంజి, దొడ్డ రవి, డి.వెంకటరెడ్డి, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: వచ్చే నెల 1వ తేదీ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వేగంగా సీసీ రోడ్డు పనులు

శావల్యాపురం: పొట్లూరు గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గ్రామంలో ప్రధాన కూడలి నుంచి ఎస్సీ కాలనీ వరకు 600 మీటర్ల సీసీ రోడ్డు పనులు మరో పది రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. ప్రస్తుతానికి 300 మీటర్ల వరకు పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ పోపూరి జ్యోతి, వైస్ ఎంపీపీ సంబూరి ప్రభావతి, గ్రామస్తులు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

చిలకలూరిపేటటౌన్: రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం రెండు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు రూరల్ సీఐ వై.అచ్చయ్య తెలిపారు. ఆటో రిక్షా, ఒక ద్విచక్ర వాహనానికి ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చేయాలన్నారు. వేలంలో పాడుకున్నవారు మోటార్ వాహనం చట్టం కింద వాహన రిజిస్ట్రేషన్ ఖర్చులు, ఇతర పన్నులను చెల్లించవలసి ఉంటుందని వివరించారు. వాహనాలకు సంబంధించిన వేలం మొత్తం సొమ్ము అదే రోజు చెల్లించాలని, లేని పక్షంలో నాలుగో వంతు వేలం సొమ్ము రద్దు చెల్లించి, మిగిలిన నగదు రెండు రోజుల్లో చెల్లించవచ్చని తెలిపారు. అలా చెల్లించని వారికి నగదు వాపసు ఇవ్వబడదని, వాహనం తిరిగి వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

రొంపిచర్లలో ఉచిత వైద్య శిబిరం

రొంపిచర్ల: నరసరావుపేటకు చెందిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జెడ్పీ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ శబరిగిరీష్, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎ.రత్న, జనరల్ మెడిసిన్ డాక్టర్ చింతాకృష్ణ చైతన్య పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పూనిరి కృష్ణమూరి, సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లిస్తాం

నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, సుబ్బయ్యపాలెం, తురుమెళ్ల గ్రామాల్లో ఆదివారం శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి, అరటి, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. మండలంలో 1000 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారని తెలిపారు. ఈ వర్షాలతో మొక్కజొన్న పంటకు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. పంట నష్టం పై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి రైతులకు పంట నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. రైతులతో పాటు కౌలు రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అంచనా వేస్తారన్నారు. ఈ నెల 30 వరకు వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారని తెలిపారు. రైతులకు మూడు నెలల్లో నష్టపరిహారం చెల్లించటం జరుగుతుందన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు దెబ్బతిన్న పంటలకు మూడు సంవత్సరాలు దాటినా నష్టపరిహారం ఇచ్చే వారు కాదని విమర్శించారు. రైతులకు మెరుగైన నష్టపరిహారం అందేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విప్పర్లపల్లి అగ్రహారం భూములకు రైత్వారీ పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, సర్పంచ్‌లు గాదె రామిరెడ్డి, గాజుల మాణిక్యం, వైఎస్సార్ సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గానుగపెంట ఉత్తమరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం వెంకట్రావు, అన్నెం పున్నారెడ్డి, దహాడు సంజీవరెడ్డి, గాదిరెడ్డి సీతయ్య, గుండాల వెంకటేష్, పానుగోటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వడ్లమూడివారిపాలెంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వైఎస్సార్ సీపీలో చేరిక

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండమీది రాజశేఖర్ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసేవారికి మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఇబ్బా సుబ్బాలురామయ్య, సొసైటీ చైర్మన్ పారా వెంకటేశ్వర్లు, దగ్గుపాటి ముత్తెయ్య, సర్పంచ్‌లు లేళ్ల వెంకటేశ్వర్లు, కంచర్ల బాబు, కోపల దేవరాజ్, జెడ్పీ కో–ఆప్షన్ మెంబరు గుండాల సైదానోమ్, ములకా రామతులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

క్లీన్ నరసరావుపేటకు సహకరించండి

- పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- విధులు సక్రమంగా నిర్వహించాలని శానిటరీ అధికారులకు సూచన

నరసరావుపేట: చెత్తను ఎక్కడా రోడ్లపై వేయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి ఇచ్చి పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రజలను కోరారు. ప్రత్యక్ష పారిశుద్ధ్య పరిశీలన డ్రైవ్ లో భాగంగా ఆదివారం మున్సిపల్ అధికారులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో బాబాపేట, ఇస్లాంపేటల్లో పర్యటించారు. ఆయా వార్డుల పరిధిలోని ముస్లిం ఖబరస్థాన్, ప్రైమరీ స్కూల్, ఈశ్వరయ్య హాల్ థియేటర్ వెనుక, చిత్రాలయ సెంటర్ ప్రాంతాల్లో మున్సిపల్ రోడ్లపై చెత్త ఉండటం చూసి పాయింట్లలో ఉన్న చెత్తను తొలగించకపోవటంపై సచివాలయ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 నుంచి పాయింట్లు ఐడెంటిఫై చేసి గ్రూపు ఏర్పాటు చేసి ప్రతి రోజూ చెత్త తొలగిస్తున్నారా? లేదా? అనేది తనిఖీ చేయాలని సూచించారు. సక్రమంగా పని చేయని వారికి మెమోలు జారీ చేయాలంటూ డీఈ శ్రీనివాసరావును కోరారు. చెత్త తీసుకెళ్లేందుకు ప్రతి రోజూ ఇళ్ల వద్దకు సిబ్బంది వస్తున్నారా? గాలేరు సక్రమంగా అందుతోందా? అని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పరిశీలన కార్యక్రమం ద్వారా వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడిందన్నారు. తాగునీటి సక్రమంగా అందుతున్నాయన్నారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద శుభ్రం చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఈస్టర్ పండగ సందర్భంగా సమాధుల వద్ద శుభ్రం చేయిస్తామని చెప్పారు. ప్లాస్టిక్‌ను నిషేధించే కార్యక్రమం త్వరలో చేపడతామన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. జేసీబీ డ్రైవ్‌లో కత్తవ వాగుతో పాటు పూడిక వాగు డ్రైయిన్‌లను శుభ్రం చేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహనరావు, వార్డు నాయకులు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, గేరా ధర్మారావు, ఫజార్, ఆజ్మల్, ముద్దా కరిముల్లా, మైలెలి మార్కు, కురుగుంట్ల కోటిరెడ్డి, సయ్యద్ షర్మాబాషా, వరవకట్ల బుజ్జి పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై మహిళలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అగ్రహార భూముల రైతులకు త్వరలో పట్టాలు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో అప్పాపురం గ్రామస్తులు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం అప్పాపురం గ్రామంలో అగ్రహార భూములకు రీ–సర్వే పూర్తయిందని, త్వరలోనే రైతులకు పట్టాలను అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. అప్పాపురం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పాపురం గ్రామంతో పాటు మండలంలోని మరి కొన్ని గ్రామాల్లోని అగ్రహార భూములకు సర్వే ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. సర్వే పూర్తయిన వెంటనే రైతులకు పట్టాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

వాహనం అదుపుతప్పి పాస్టర్‌కు గాయాలు



గాయాలపాలైన పాస్టర్ తిరుపతయ్య

నాదెండ్ల: చర్చిలో ప్రార్థనకు వెళుతూ ద్విచక్ర వాహనం అదుపు తప్పి పాస్టర్‌కు గాయాలైన సంఘటన ఆదివారం గణపవరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన పాస్టర్ తిరుపతయ్య ప్రతి ఆదివారం చిలకలూరిపేట వైఎస్సార్ కాలనీలోని చర్చిలో ప్రార్థనలు చేసేందుకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో గుంటూరు నుంచి గణపవరం మీదుగా బైపాస్ గుండా వైఎస్సార్ కాలనీకి చేరుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గణపవరం పోలేరమ్మ గుడి సమీపానికి రాగానే వాహనం అదుపుతప్పి పడిపోయారు. దీంతో ఆయన గాయాలపాలుకాగా, స్థానికుల సమాచారంతో 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): వి.అప్పాపురం గ్రామంలో వేంచేసియున్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

గొరిజవోలులో పోలీసుల పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న వినుకొండ రూరల్ సీఐ రమేష్‌బాబు



పల్లెనిద్రలో భాగంగా అలవాలలో డీఎస్పీ విజయభాస్కరరావు

నాదెండ్ల: గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఎస్ఐ ఆవుల బాస్కర్ చెప్పారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు గొరిజవోలు గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధిలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమస్యలుంటే రాతపూర్వకంగా తమకు ఫిర్యాదు చేసినట్లయితే సామరస్యంగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఘర్షణలు వల్ల ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, కుటుంబ పరంగా నష్టపోవడం మినహా సాధించేది ఏమీ ఉండదని సూచించారు. వివాదాలకు దూరంగా ప్రశాంతమైన పల్లెలను నిర్మిద్దామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరిజపాటి గృహలక్ష్మి, ఎంపీటీసీ గేరా సుహాసిని, మాజీ ఎంపీటీసీ కంజుల వీరారెడ్డి, కురుకుంట్ల వెంకటరెడ్డి, అంజిరెడ్డి, రఘురామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ములకలూరులో..

వినుకొండ(నూజెండ్ల): జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో శనివారం రాత్రి వినుకొండ రూరల్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ అనిల్‌కుమార్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు స్నేహపూర్వకంగా ఉండాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇరువర్గాలకు చెందిన పెద్దలు ముందుగా మాట్లాడుకొని సమన్వయంతో పరిష్కరించుకోవాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల బాబు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలవాల గ్రామంలో 'పల్లెనిద్ర'

రొంపిచర్ల: మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన అలవాలలో శనివారం రాత్రి పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను గ్రామస్తులు డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ పార్టీలకు అతీతంగా వివాదాలు జోలికి పోకుండా కలిసిమెలిసి జీవించాలని సూచించారు. అనంతరం గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బస చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లటూరులో..

బొల్లాపల్లి: వెల్లటూరు గ్రామంలో బండ్లమోటు ఎస్ఐ జి.బలరాంరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బలరాంరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు పల్లెనిద్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలిగే ప్రధాన కార్యక్రమమని చెప్పారు.

రాహుల్‌గాంధీ అనర్హతపై నిరసన

నోటికి నల్లగుడ్డలు కట్టి గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించిన నాయకులు

నరసరావుపేట: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీని పార్లమెంటు సభ్యునిగా అనర్హత ప్రకటించినందుకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నోటికి నల్లగుడ్డలు ధరించి స్టేషన్ రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐసీసీ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు జి.అలెగ్జాండర్‌సుధాకర్ నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొని మాట్లాడారు. పీసీసీ అధికార ప్రతినిధి రాధాకృష్ణ, సత్తెనపల్లి ఇన్‌చార్జి చంద్రపాల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వేద్మాద్రి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా గోపి మాట్లాడుతూ రాహుల్ గాంధీపై కావాలనే పరువునష్టం దావా వేయించి రెండేళ్ల శిక్షతో పాటు ఎంపీగా అనర్హత వేటు వేయడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ హస్తం ఉందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదన్నారు. రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్ర, భవాని వెంకటేష్, శివారెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.



మహాత్ముని విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శరవేగంగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ పనులు

సొసైటీ చైర్మన్ చెన్నయ్య

శావల్యాపురం: వేల్పూరు గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో నాబార్డు, కేంద్ర వ్యవసాయ సహకార సొసైటీ సారథ్యంలో నిర్మిస్తున్న శీతలగిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్) భవనం పనులు తుది దశకు చేరాయి. ఈ సందర్భంగా శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నేతృత్వంలో 3 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన శీతల గిడ్డంగి భవన నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయన్నారు. మిగిలిన పనులు త్వరితగతిన సాగుతున్నాయని తెలిపారు. 1000 మెట్రిక్ టన్నుల గోదాము పనులు కూడా రూ.75 లక్షల వ్యయంతో జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్ తదితరులు ఉన్నారు.



వేల్పూరులో నిర్మాణ దశలో ఉన్న కోల్డ్ స్టోరేజ్ భవనం

బహుముఖ నిలయాలు విజ్ఞాన కేంద్రాలు

నరసరావుపేట: బహుళ కార్యక్రమాలకు నిలయాలుగా విజ్ఞాన కేంద్రాలు నిలుస్తాయని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులో పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కేఎస్‌తో పాటు బాలోత్సవ వ్యవస్థాపకుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, యూటీఎఫ్ పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎ.వాగేశ్వరిదేవి, రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల సమన్వయ కమిటీ కార్యదర్శి విన్నమనేని మురళీకృష్ణ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు పాశం రామారావు, విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గడ్డె ఉజ్జయ్య హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సభాధ్యక్షులుగా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ వ్యవహరించగా, సభకు విజ్ఞాన కేంద్రం కోశాధికారి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సిద్ధం చేసేలా విజ్ఞాన కేంద్రాలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పల్నాడు అభివృద్ధికి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు శుభ పరిణామమన్నారు. ఎ.వాగేశ్వరిదేవి మాట్లాడుతూ పల్నాడు ప్రాంత ప్రజలు, యువత విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి సహకరించాలని కోరారు. విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ సభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయులునాయక్, విజ్ఞాన కేంద్రం కార్యకలాపాల కన్వీనర్ మస్తాన్‌వలి, ప్రజా సంఘాల నాయకులు సిలార్ మసూద్, ఈ.మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నడకతో మెరుగైన ఆరోగ్యం

నాదెండ్ల: పరికరాలు, కాలంతో పనిలేకుండా కేవలం నడకతో రోగాలు లేని మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని నేతాజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యశస్వి రమణ చెప్పారు. గణపవరంలో నేతాజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నడకతో కలిగే ప్రయోజనాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నుంచి శివాలయం వరకూ, అక్కడి నుంచి పోలేరమ్మ గుడి వరకూ రేపిలాగ శివాలయం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళ్లు కష్టపడితే ఆరోగ్యం కుదుటపడుతుందన్నారు. అడుగు ముందుకేస్తే రోగం వెనుకంజ వేస్తుందన్నారు. నడకతో ఆరోగ్యమే కాక రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, హృదయ సంబంధ వ్యాధులు సైతం మెరుగవుతాయన్నారు. ప్రతి రోజూ ప్రతి వ్యక్తి అరగంట నుంచి గంట వరకూ నడవాలన్నారు. ఎండలో నడిస్తే డి–విటమిన్ పొంది దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పెంటేల హనుమంతరావు, ఉపాధ్యక్షుడు వేలు, సంయుక్త కార్యదర్శి పెదపల్లి సుందరేశ్వర్లు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, కంచర్ల శ్రీను, కాట్రు కృష్ణారావు, అచ్చయ్య మాస్టారు, గాలి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రమణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

నాదెండ్ల: గణపవరంలోని తులసీవనం వృద్ధాశ్రమంలో ఆదివారం గుంటూరు యశస్వి హస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో పలువురు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మెరుగైన వైద్యం కోసం పలువురిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యశిబిర నిర్వాహకుడు డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ గుంటూరులోని తన వైద్యశాల ఆధ్వర్యంలో ప్రతి నెలా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్నామని తెలిపారు. తన తల్లి పేరిట తన స్వగ్రామంలోని సొంతింటిలో తులసీవనం వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని, సమాజంలో శక్తిగల వారు సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కె.పూజిత, కె.ప్రియాకోషల్య, అభిషేక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యశస్వి రమణ

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 268 మంది పదో తరగతి విద్యార్థులు ఉండగా మండల స్థాయిలో శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో తగుచర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా దాదాబాయ్ శారదదేవి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రామారావును జిల్లా కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో భద్రపరుస్తామన్నారు.